క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మైనార్టీ నాయకులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, మాజీ కార్పొరేటర్ షేక్ బీజాన్ బీ దంపతులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ దంపతులు వైఎస్ జగన్‌ను కలిసి ముస్లిం సంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. జగనన్న నిర్దేశం మేరకు నడుచుకుంటామని స్పష్టం చేశారు.

జిల్లా మాస్టర్ అథ్లెట్ల సత్తా



విజయవాడస్పోర్ట్స్: అనంతపురంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి 43వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 26 మందిలో 21 మంది పలు విభాగాల్లో 52 పతకాలను సాధించి సత్తా చాటారు. పతకాలు సాధించిన రామస్వామి, గంగాధరరావు, నెల్సన్, జోజి, వెంకట్రావు, రవీంద్రరావు, తిలక్, సాంబశివరావు, సత్యనారాయణ, జ్యోతిప్రకాష్, జమాల్‌బాబు, రామకృష్ణ, శ్రీనివాసనాయక్, కోటేశ్వరరావు, శివగణేష్‌బాబు, రాజేశ్వర్, సుబ్బలక్ష్మి, చంద్రమణి, గీతాంజలి, అరుణ, కుముద్వతి త్వరలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి.ప్రసాదరావు అభినందించారు.

కేసీపీ షుగర్ ఫ్యాక్టరీ సందర్శన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ తమ రంగాల్లోని అంశాలపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ తెలిపారు. ఆ కళాశాల ఎంబీఏ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మంగళవారం ఉయ్యూరులోని కేసీపీ షుగర్స్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక అంశాలను తెలుసుకోవటమే కాకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు చక్కెర ఉత్పత్తి విధానం, ముడి సరుకు ప్రాసెసింగ్, పరిశ్రమలో నిర్వహణ వ్యూహాలు, మార్కెటింగ్, సరఫరా గొలుసు నిర్వహణ వంటి అంశాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి సహాయపడిందని అధ్యాపకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.వరలక్ష్మి, టి.బిందుసుస్మిత పాల్గొన్నారు.

కొత్తపేట సీఐ వ్యవహారంపై సీపీ స్పందించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని కొత్తపేట పోలీసుస్టేషన్ సీఐ కొండలరావు ఘటనపై జిల్లా పోలీసు కమిషనర్ తక్షణమే స్పందించాలని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను సీఐ అమలు చేసినందుకు, ఉన్నతాధికారులు సూచనల మేరకు కేసు నమోదు చేసినందుకు కూటమి పార్టీలకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి ఇష్టానుసారం మాట్లాడారన్నారు. అందుకు మనస్థాపం చెంది సీఐ ఫోన్ స్విచ్ ఆఫ్‌చేయటమే కాకుండా వాహనం వదిలేసి వెళ్లిపోయారని, గత మూడు రోజులుగా విధులకు హాజరు కావడం లేదని పత్రికల్లో వస్తున్నాయన్నారు. దీనిపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గాని, హోం శాఖ మంత్రి గానీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీంతో కూటమి పాలనలో ప్రజలకు, మహిళలకు, యువతకే కాదు పోలీసులకు సైతం రక్షణ లేదని స్పష్టమైందన్నారు.

గంజాయి విక్రయ కేంద్రాలుగా రైల్వేస్టేషన్ పరిసరాలు

- రోజూ వేల రూపాయల్లో చేతులు మారుతున్న వైనం
- పట్టించుకోని నిఘా వ్యవస్థ
- మత్తులో జోగుతున్న యువత
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి



బొగ్గులైన్ రైల్వే క్వార్టర్స్



గంజాయి విక్రయాలు జరిగే డీజిల్ లోకో షెడ్డు వెనుక ప్రాంతం

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు గంజాయి విక్రయాలకు అడ్డాగా మారాయి. వించిపేట, నైజాంగేట్, పాత ఆర్‌ఆర్‌పేట ఎర్రకట్ట డౌన్, బొగ్గులైన్ రైల్వే క్వార్టర్స్, డీజిల్ లోకో షెడ్డు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

రైల్వే కాలనీలు, పార్కులే కేంద్రాలు..

ఈ ప్రాంతాల్లో నిత్యం వేల రూపాయల విలువ చేసే గంజాయి పొట్లాలు చేతులు మారుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. రైల్వే స్టేషన్‌కు అతి సమీపంలో ఉండటం, పోలీసు నిఘా వ్యవస్థ తక్కువగా ఉండటంతో రైళ్లలో గంజాయితో వచ్చే వారు రైల్వే స్టేషన్‌కు వెళ్లకుండానే స్టేషన్ అవుటర్‌లోనే దిగుతూ గంజాయిని విచ్చలవిడిగా అమ్ముతున్నారని స్థానిక రైల్వే ఉద్యోగులు వెల్లడిస్తున్నారు. రైళ్లలో తీసుకువచ్చిన గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి రూ.250 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నారు. నిఘా లేని రైల్వే కాలనీలు, పార్కులు కేంద్రాలుగా గంజాయి విక్రయాలు చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో విక్రయాలు..

ఉదయం 6 గంటల నుంచి విక్రయాలు చేస్తుంటారని తిరిగి సాయంత్రం వేళల్లో విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. గంజాయిని కొనేందుకు యువకులు డీజిల్ లోకో షెడ్డు, బొగ్గులైన్ క్వార్టర్స్, పాత ఆర్‌ఆర్‌పేట, వించిపేట నైజాంగేట్‌సెంటర్ తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో చేరుతుంటారని స్థానికులు చెబున్నారు.

కొరవడిన పోలీసుల నిఘా..

రైల్వే పరిసర ప్రాంతాలు కావటం పోలీసుల నిఘా లేకపోవటంతో వీరికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని స్థానికులు చెబున్నారు. స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఈ గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

గంజాయి విక్రయాలను అడ్డుకోవాలి..

పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేసి గంజాయి విక్రయించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. రైల్వే పరిసర ప్రాంతాల్లో మరింత నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి. అప్పుడే గంజాయి అమ్మకాలకు అడ్డుకట్ట పడుతుంది.

– వేంకటేశ్వరరావు, రైల్వే ఉద్యోగి

రైళ్లలో తెచ్చి అమ్మకాలు..

డీజిల్ లోకో షెడ్డు, పాత ఆర్‌ఆర్‌పేట ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. విశాఖపట్నం, మచిలీపట్నం నుంచి వచ్చే రైళ్లు ఈ మార్గంలో వస్తుండటంతో వాటిలో వచ్చే వారు ఇక్కడ దిగి గంజాయి విక్రయిస్తుంటారు.

– ఆరిఫ్, స్థానికుడు

ఘంటసాల గానామృతం భావి తరాలకు అందించాలి



తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహం వద్ద చంద్రశేఖర్, గోళ్ల నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్: గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానామృతాన్ని భావి తరాలకు అందించాలని కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ఘంటసాల కళావేదిక ఆధ్వర్యాన మంగళవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ తెలుగు వారుతున్నంత వరకు ఘంటసాల స్వరం ఉంటుందని తెలిపారు. సద్గురు త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు నగరంలోని సంస్థలు ఘంటసాల ఉత్సవాలను చేయాలన్నారు. ఘంటసాల కళావేదక నిర్వాహకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కళలతోనే మనోవికాసం కలుగుతుందన్నారు. 2009లో కళాపోషకుడు శింగంశెట్టి పెద బ్రహ్మం ఘంటసాల విగ్రహాన్ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, గాయకులు శ్యాం ప్రసాద్, డాక్టర్ రామతీర్థ, డేవిడ్‌రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘంటశాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో

ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యాన సంగీత కళాశాలలోని గోకరాజు గంగరాజు కళావేదిక పై గాయకుడు గుడిపాటి హరి కృష్ణ, సుధాశ్రీనివాస్ బృందం పలు ఘంటసాల పాటలను మధురంగా ఆలపించారు. భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మల్లికార్జునరావు, ఉప సంచాలకుడు పెంచలయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ, అధ్యాపకులు పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు విజ్ఞప్తి చేశారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న పార్క్ సిబ్బందికి ఆప్కాస్ వర్కర్ల మాదిరిగానే దుస్తులు, కొబ్బరి నూనె, చెప్పులు అందించాలని ఈ మేరకు వారు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఎస్‌వీఎస్ చలం, దారా రాంబాబు, యూనియన్ నాయకులు బుద్దె రాజా మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ఉన్న పార్కులలో సుమారు 300 మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఆప్కాస్ వర్కర్స్‌కు ఇస్తున్న సామగ్రి వారికి అందించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ప్రస్తుతం రూ.15 వేలు జీతం చెల్లిస్తున్నారని, అందులోనే ఈఎస్ఐ, పీఎఫ్ కటింగ్ అవుతున్నాయన్నారు. మిగిలిన జీతంతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా ఉందని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కనీసం రూ.26 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తుపాకుల ప్రతాప్, విజయ్, టి.ఉమ, దాంగే, కృష్ణవేణి, సీత, జి.రమణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం ప్రకారం బిల్డింగ్ వర్కర్స్ బోర్డు నిధులను వారి సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని, మరే ఇతర ఇతర అవసరాలకు వాడకూడదని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా కమిటీతో కలిసి విజయవాడలోని లేబర్ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబును మంగళవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. వలస కార్మికులకు మన రాష్ట్రంలో ఏ విధమైన చట్ట భద్రత లేని నేపథ్యంలో బోర్డును పునరుద్దరించి దానిలోని పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో అసంఘటిత భవన నిర్మాణ కార్మికులు 30 లక్షల మంది ఉన్నారని, అందులో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2,50,000ల మంది ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే వలస కార్మికులకు సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తద్వారా పథకాలను వారికికూడా అమలు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా 60 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ సౌకర్యంతో పాటు సొంత ఇంటి కలను బోర్డు ద్వారా నెరవేర్చాలని, చట్ట భద్రత కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి త్వరలో సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు కృషి చేస్తామని చెప్పినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. అనంతరం డీసీఎల్ ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆషారాణి, సహాయ కార్మిక శాఖ అధికారి బి.కిశోర్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, కోశాధికారి బి.బెనర్జీ, ఉపాధ్యక్షులు వీబీ రాజు పాల్గొన్నారు.

అర్చకుడు రంగరాజన్‌పై దాడి దారుణం

సాక్షి, అమరావతి: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని సీపీఐ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఇటీవల జరిగిన పలు దాడులను ఖండిస్తూ తీర్మానం చేసింది. రంగరాజన్ ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేయడం దారుణమని, హైదరాబాద్ పుస్తక పుస్తక మహోత్సవంలో ఎన్.వేణుగోపాల్‌పైన, తిరుపతి పుస్తక మహత్సవంలో విశాలాంధ్ర బుక్ హౌస్ స్టాల్‌లో పుస్తకాన్ని చించి తగలబెట్టేందుకు దుండగులు చేసిన ప్రయత్నాలను సీపీఐ తీవ్రంగా ఖండించింది. గత పదేళ్లుగా దేశంలోని హిందుత్వ భావజాలపక్షం, దాని అనుకూల పక్షాలు ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి దాడులు పెరిగాయని సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ రాష్ట్ర నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, జెల్లి విల్సన్, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా చిన్నారుల స్నాతకోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని విజయవాడ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ జాబిల్లి క్యాంపస్ బ్రాంచిలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కాన్వొకేషన్ సెర్మనీ కార్యక్రమం వేడుకగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సన్‌రైజ్ హాస్పిటల్స్ ఫిజీషియన్ డాక్టర్ ఏవీ భట్టర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉన్నతిని ఆకాంక్షిస్తూ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. రవీంద్ర భారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ మాట్లాడుతూ.. నగరంలోని తమ పాఠశాలకు చెందిన వివిధ బ్రాంచిలలో చదువుకుంటున్న చిన్నారులందరూ భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి మాట్లాడుతూ కేవలం చదువులోనే కాకుండా యోగ, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ వారు రాణించేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. స్నాతకోత్సవ దుస్తులలో తమ చిన్నారులను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, అకడమిక్ ఆఫీసర్ ప్రియదర్శిని, జోనల్ ఇన్‌చార్జ్ సరళ, క్యాంపస్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలుచేయడానికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటోందని దీనిపై మూడు సర్కిళ్ల పరిధిలో వీఎంసీ జోనల్ కమిషనర్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారని కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్మకాల హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, హోటల్, క్యాటరింగ్, కర్రీ పాయింట్, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాప్ యజమానులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్జీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులందరితో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై జోనల్ కమిషనర్లు సమావేశం నిర్వహించారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం, అమ్మకం దానితో కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలు వంటి విషయాలపై అధికారులు అవగాహన కల్పించారని వివరించారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ చట్ట ప్రకారం 120 మైక్రోన్స్ పరిమాణం కంటే తక్కువ పరిమాణమున్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అమ్మకాన్ని వీఎంసీ నిషేధించిందని పేర్కొన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా వాడాల్సిన వస్తువులు, పర్యావరణ హిత పదార్థాలతో తయారు చేయచేసిన వస్తువుల వాడకాన్ని సమావేశానికికి వచ్చిన వారికి వివరించారని తెలిపారు.

వ్యర్థాల సేకరణలో జాప్యం చేయొద్దు



పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వ్యర్థాల సేకరణలో జాప్యం చేయొద్దని, రోడ్ల వెంట వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిరచాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన శిఖామణి సెంటర్, బాడవపేట, వుడ్‌పేట, గుణదల ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యర్థాలను కచ్చితంగా సేకరించాలని, రోడ్లపై వ్యర్థాలను ట్రాక్టర్లతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపం తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. నగరంలో మూడు సర్కిళ్ల పరిధుల్లోని అన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, మరుగుదొడ్లలో నీటి సరఫరా, బకెట్లు తదితర సౌకర్యాల కల్పనలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్ వద్ద నమ్మ టాయిలెట్లను పరిశీలించి అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.సామ్రాజ్యం, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి పట్టుదల ప్రశంసనీయం



అథ్లెట్ జ్యోతి యర్రాజీని అభినందిస్తున్న రాఘవేంద్రరావు, హైమ



జిమ్నాస్టిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన యాసిన్‌ను అభినందిస్తున్న శాప్ స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు

విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో సత్తా చాటుతున్న అథ్లెట్ జ్యోతి యర్రాజీ పట్టుదల ప్రశంసనీయమని దక్షిణ భారత అథ్లెటిక్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఆకుల రాఘవేంద్రరావు అన్నారు. రాష్ట్రానికి చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ 100 మీటర్ల హార్డిల్స్‌లో ఇటీవల గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన 200 మీటర్ల రన్నింగ్‌లోనూ అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అథ్లెట్ జ్యోతిని రాఘవేంద్రరావు, ఏపీఅథ్లెటిక్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి హైమ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఒలింపిక్ పతకం సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

షేక్ యాసిన్‌కు గోల్డ్

జిమ్నాస్టిక్‌లో రాష్ట్ర క్రీడాకారిణి షేక్ యాసిన్‌ను మంగళవారం గోల్డ్ మెడల్ సాధించినట్లు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) కోచ్ సురేష్ వద్ద యాసిన్ చిన్ననాటి నుంచి శిక్షణ తీసుకుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 38వ జాతీయ క్రీడల జిమ్నాస్టిక్స్‌లో అన్ని రాష్ట్రాల క్రీడాకారులను వెనక్కి నెట్టి ఏపీకి బంగారు పతకం అందించిన యాసిన్‌ను అభినందించారు.

కనులపండువగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి గరుడోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవం మంగళవారం సాయత్రం నేత్రపర్వంగా జరిగింది. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో పురాతన ఆలయంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఐదో రోజుకు చేరాయి. అందులో భాగంగా శ్రీవారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణ, భక్తుల శ్రీహరి నామస్మరణ, మహిళల కోలాట విన్యాసాలు, చిత్రవిచిత్ర వేషధారణల మధ్య రథోత్సవం కన్నుల పండువుగా ముందుకు సాగింది. తొలుత అత్యంత రమణీయంగా అలంకరించిన రథంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను అధిష్టింపజేశారు. అనంతరం ప్రత్యేక వైధిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. చివరిగా ఆలయ కమిటీ చైర్మన్ గుడిపాటి పాపారావు ఇతర ప్రముఖులు రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం బ్రాహ్మణ వీధిలోని ఆలయం నుంచి ప్రారంభమై పాత పోస్టాఫీస్ సెంటర్, కోమలవిలాస్ సెంటర్, రమణయ్య కూల్‌డ్రింక్‌షాప్, సామారంగంచౌక్, శేషయ్య వీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. కమిటీ పూర్వ సభ్యుడు గర్రె సురేష్ తదితరులు ఉభయ దాతలుగా వ్యవహరించారు.

ఘనంగా గరుడ వాహనోత్సవం

స్వామివారి సన్నిధిలో మంగళవారం ఉదయం గరుడసేవ వాహనోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామివారి వాహనాల్లో గరుడవాహన సేవకు ప్రత్యేక స్థానముందని పండితులు చెబుతారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో పలు ప్రత్యేక హోమాలను, ఇతర సహస్ర నామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి పలు పూజలను నిర్వహించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంపై గరుడ వాహనం ఆశీనులైన శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారిని అధిష్టింపజేసి నగర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ స్వామివారి వాహనసేవల్లో గరుడ వాహనసేవ, రథోత్సవాలు అత్యంత కీలకమైనవన్నారు. కార్యక్రమాలను గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. వైదిక కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.

దేవుని తల్లి.. ఆశీర్వదించు మాతా..











గుణదల మేరీమాత ఉత్సవాల్లో చివరి రోజు మంగళవారం దేశ విదేశాల నుంచి వచ్చిన విశ్వాసులతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. విదేశీ యాత్రికులు ఉత్సవాలకు ఆకర్షణగా నిలిచారు. ఆలయ గురువులు సమిష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేలా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశ్వాసులు మరియమాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని తల్లి.. ఆశీర్వదించు మాతా అంటూ వారు మరియమాత నీరాజనాలందుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ